సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 9 | ఏప్రిల్ | 2023



అన్నదానానికి విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నిత్యాన్నదానానికి పోతూరి సోమశేఖర్, సుహాసిని దంపతులు(మచిలీపట్నం) రూ.50వేలు విరాళం అందజేశారు.




మొక్కజొన్న.. లాభాల మిన్న

మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందుతున్నారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,185, మధ్య డెల్టాకు 1,420, పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 6.55 అడుగులకు నీటి మట్టం చేరింది.



న్యూస్‌రీల్

బాలబాలాజీ స్వామికి రూ.2.68 లక్షల ఆదాయం



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.72 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.96,325 కలిపి స్వామి వారికి రూ.2,68,325 ఆదాయం సమకూరింది. స్వామి వారిని మొత్తం 3,659 మంది భక్తులు దర్శించుకున్నారు. 3,041 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ఉద్యోగులు పర్యవేక్షించారు.

ఐదుగురు ఎస్సైల బదిలీలు

అమలాపురం టౌన్: జిల్లాలో ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రావులపాలెం ఎస్సై జి.సురేంద్రను మలికిపురం, అక్కడి ఎస్సై హరికోటి శాస్త్రిని పి.గన్నవరం బదిలీ చేశారు. పి.గన్నవరం, రాజోలు ఎస్సైలుగా పని చేస్తున్న పి.గంగాభవాని, బి.కృష్ణమాచారిని అమలాపురం ఎస్పీ కార్యాలయంలోని డీసీఆర్‌బీలో నియమించారు. ఇప్పటి వరకూ వీఆర్‌లో ఉన్న ఎస్సై జి.పృథ్విని రాజోలు ఎస్సైగా బదిలీ అయ్యారు.

శనైశ్చరునికి వెండి నంది సమర్పణ



స్వామివారికి వెండి నంది సమర్పిస్తున్న గోపాలరావు దంపతులు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారికి సలాది సత్యగోపాలరావు (కాజులూరు మండలం గొల్లపాలెం) 500 గ్రాముల వెండి నందిని సమర్పించారు. స్వామి వారిని శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకం జరిపించారు. సుమారు రూ.50 వేల విలువైన నంది విగ్రహాన్ని దేవస్థానం ఎస్‌ఏ కిరణ్ చేతుల మీదుగా ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామ్మూర్తికి అందజేశారు. అలాగే స్వామివారి అన్నప్రసాద శాలకు ఏలూరు సీఐ నల్లా దుర్గాప్రసాద్ రూ.8 వేల విలువైన రైస్ ట్రాలీ అందజేశారు. ఇదిలా ఉండగా స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. ప్రాతఃకాల అర్చన అనంతరం తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. భక్తుల సౌకర్యాలను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, ఈఓ సింగం రాధ పర్యవేక్షించారు. సుమారు 400 మంది భక్తులు నేతితో చేసిన స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ప్రత్యక్ష సేవలు, పరోక్ష సేవలకు కలిపి రూ.1,66,656, అన్నదాన పథకానికి విరాళాలుగా రూ.36,646 ఆదాయం సమకూరిందని ఈఓ రాధ తెలిపారు.

తేనెలొలికే మాధుర్యం

- వేసవిలో దొరికే అరుదైన ఫలం పనస
- అంబాజీపేట కేంద్రంగా మార్కెట్
- ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు
- ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరుకు ఎగుమతి



సాక్షి, అమలాపురం/అంబాజీపేట: 'అరమగ్గిన పనస పండు తినడానికే జీవించి ఉండాలని' నానుడి. పులసకే కాదు.. పనస రుచులకు సైతం గోదావరి జిల్లాలు ప్రసిద్ధి. అందరికీ ఎంతో ఇష్టమైన పనస పుట్టుకకు సంబంధించి ఆసక్తికర విషయం కూడా ఉంది. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు అనాసకు ప్రతిగా పనసను సృష్టించాడని అంటారు. తేనెలొలికే తియ్యదనం దీని సొంతం. పనస పండు పరిమళం నాసికా పుటాలకు తగలగానే నోట్లో నీరూరక మానదు. ఇక పనసతో చేసే రకరకాల కూరలు సైతం జిహ్వాచాపల్యాన్ని తీరుస్తాయి. పెంచిన రైతుకు పనస కాయల ద్వారా మంచి ఆదాయం వస్తుంది. అంతే కాదు.. దీని కలప ధర కూడా టేకు తరువాతి స్థానంలో ఉంది.

- వృక్ష శాస్త్రంలో పువ్వు నుంచి పిందె, పిందె నుంచి కాయ, పండు పుట్టుకొస్తూ ఉంటాయి. కానీ చెట్టు మొదలు నుంచి చివరి వరకూ కాండం నుంచే పనస కాయలు కాయడం విశేషం.
- దీనికి పురుగు మందులు, ఎరువుల వాడకం ఉండదు. ఇప్పుడు లభ్యమవుతున్న పండ్లలో పూర్తి సేంద్రియమైనది ఇదొకటి. ఒక కప్పు పనస తొనల్లో 157 కేలరీల శక్తి, 2.84 గ్రాముల ప్రొటీన్, 1.06 గ్రాముల కొవ్వు, 38.36 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2.5 గ్రాముల ఫైబర్, 31.48 గ్రాముల షుగర్, 48 మిల్లీగ్రాముల మెగ్నీషియం, 739 గ్రాముల పొటాషియం ఉంటాయి.
- మార్చి నుంచి జూలై వరకూ పనస చెట్టుకు బరువైన కాయలు వేలాడుతూ కనిపిస్తాయి. ఒక్కో చెట్టుకు 50 నుంచి 100కు పైగా కాయలు కాస్తాయి. ఒక్కో కాయ 10 నుంచి 20 కేజీల వరకూ బరువుంటుంది. ఈ కాయలు ఎంత బరువున్నా అందులో 30 శాతం మాత్రమే తినడానికి ఉపయోగపడుతుంది.
- గోదావరి డెల్టా, లంకల్లోని కొబ్బరి తోటల్లో పనస చెట్లను పెంచడం ఎప్పటి నుంచో ఉంది. ఈ జిల్లాలో సుమారు 100 ఎకరాలకు సరిపడా పనస సాగు జరుగుతోందని అంచనా.
- అంబాజీపేట కేంద్రంగా ఏడాదికి సుమారు రూ.50 లక్షల విలువైన పనస కాయలు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి నగరాలకు రోజూ ఎగుమతి అవుతూంటాయి. ఒక్కో చెట్టుకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ ఆదాయం వస్తోంది.



పనస పొట్టు కూర



పనస ముక్కల బిర్యానీ



తేనెలూరే పనస తొనలు

సండే స్పెషల్

- పనసలో బంగారు పనస, కొబ్బరి పనస, ఖర్జూర పనస, వేరు పనస, చిన్నకోల పనస, గుండ్రు పనస, గులాబీ పనస, కర్ణ పనస, తేనె పనస అనే రకాలున్నాయి. వివాహాది శుభ కార్యాల్లో పనస కాయ తప్పనిసరి. ముఖ్యంగా పసుపు కుంకాలకు పనసకాయ ఇవ్వడాన్ని శుభంగా భావిస్తారు.
- పనస తొనలే కాదు.. కాయ, గింజలతో కూడా పలు రకాల కూరలు తయారు చేస్తుంటారు. పచ్చి పనస కాయను పొట్టుగా కొట్టి, కూర వండుతారు. దీనికి గోదావరి జిల్లాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇదే కాకుండా పనస ముక్కలతో తయారు చేసే బిర్యానీ, మసాలా కూరలు వెజిటేరియన్లకు ఎంతో ప్రీతికరం. పనస గింజలను కాల్చుకు తినేవారే కాదు.. వాటిని కొబ్బరి తురుముతో కలిపి కూరలు చేసుకునేవారు కూడా ఉన్నారు.
- పనస ఆకులను బుట్టలుగా చేసి తయారు చేసే అల్పాహారం 'పొట్టిక్కల'కు ఉన్న డిమాండ్ తెలియంది కాదు. ఇడ్లీ పిండితో తయారు చేసే ఆ వంటకానికి ఆ రుచి రావడానికి పనస ఆకులే కారణం. ఇప్పుడు పొట్టిక్కలు కోనసీమ దాటి హైదరాబాద్, విజయవాడ, విశాఖలకు సైతం విస్తరించాయి. వారికి కావాల్సిన పనస ఆకుల బుట్టలు కోనసీమ నుంచే ఎగుమతి అవుతుంటాయి.
- ఫర్నిచర్ తయారీలో కూడా పనసకు మంచి డిమాండ్ ఉంది. కప్ బోర్డులు, కుర్చీలు, మంచాలు, గుమ్మాలు, దివాన్‌కాట్‌లను పనస చెక్కతో చేయించడం గొప్పగా భావించేవారున్నారు.

సంక్షేమ సారథి జగన్



ఓ ఇంటి వద్ద సీఎం జగన్ చిత్రంతో ఉన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: అన్ని వర్గాల ప్రజలకూ సమాంతరంగా సంక్షేమం అందిస్తూ, అన్ని వర్గాలనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతృప్తి పరుస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక 22వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయన రెండో రోజైన శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పట్టణ సచివాలయాలు, గృహసారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లారు. నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమాన్ని ఆయా కుటుంబ సభ్యులకు వివరించారు. ఆ ఇళ్ల గుమ్మాలకు ముఖ్యమంత్రి జగన్ చిత్రంతో ఉన్న 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను మంత్రి స్వయంగా అతికించారు. ఆ వార్డు సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు ఇళ్లల్లోని మహిళలు, పెద్దలు, వృద్ధులతో మంత్రి, ఎమ్మెల్సీలు మమేకమై, ఆ ఇళ్లలోని వారితో కొద్దిసేపు గడిపి, జగన్ సంక్షేమ పాలనను వివరించారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ముమ్మిడివరం/రాయవరం: జిల్లాలో పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి తెలిపారు. 111 కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిషు పరీక్షకు 19,215 మంది విద్యార్థులకు గాను 19,112 మంది (99.46 శాతం) హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల జిల్లా పరిశీలకురాలు అమలాపురం, పి.గన్నవరం, అంబాజీపేటల్లోని ఎనిమిది కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈఓ కమలకుమారి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్ అధికారులు కూడా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈఓ తెలిపారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

కాట్రేనికోన: డీఈఓ కమలకుమారి కాట్రేనికోన, చెయ్యేరుల్లోని పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందనే మెరిట్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణల మేరకు ఆమె ఈ తనిఖీ చేపట్టారు. సిబ్బంది నిబంధనలు ఉల్లంఘించి పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఒకరు ఉదయం 9.25 గంటల వరకూ కాట్రేనికోన పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లలేదు. అతడిని గమనించిన పోలీసులు వెంటనే బయటకు పంపించి వేశారు.

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా విజయబాబు



కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు 3వ బెటాలియన్ కమాండెంట్‌గా సీహెచ్ విజయబాబు నియమితులయ్యారు. ఇప్పటి వర్తకు ఇన్‌చార్జి కమాండెంట్‌గా జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు వ్యవహరించారు. తాజాగా ఆయన బదిలీ అవడంతో కొత్తగా నియమితులైన విజయబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు.

కొత్త ఎస్పీగా శ్రీధర్

- గతంలో అమలాపురం డీఎస్పీగా అనుభవం
- కొత్త జిల్లాపై అవగాహనకు అదే మార్గం



కొత్త ఎస్పీ సుసారపు శ్రీధర్



బదిలీపై వెళుతున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అమలాపురం టౌన్: జిల్లా కొత్త ఎస్పీగా సుసారపు శ్రీధర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. వాస్తవానికి ఆయన ఇక్కడ పూర్తి స్థాయి ఎస్పీగా పని చేస్తూనే ఆరు నెలలుగా తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా కూడా ఉన్నారు. ఇప్పుడు బదిలీతో అక్కడ పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లాకు నూతన ఎస్పీగా వస్తున్న శ్రీధర్ 2011–12 మధ్య అమలాపురం డీఎస్పీగా పని చేశారు. అంతకు ముందు కోనసీమలోనే ట్రైనీ డీఎస్పీగా కొన్ని నెలలు శిక్షణ పొందారు. నాటి అనుభవమే ఆయనకు ఈ జిల్లాపై పూర్తి అవగాహనకు మార్గం కానుందని జిల్లాలోని పోలీసు అధికారులు అంటున్నారు. అమలాపురం డీఎస్పీగా ఉన్న సమయంలోనే విధి నిర్వహణలో నీతిపరుడిగా ఆయన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శ్రీధర్ పోలీసు అధికారిగా పని చేశారు. గతంలో విజయనగరం జిల్లా ఇంటెలిజెన్స్ అధికారిగా పని చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక విజయవాడలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ), కౌంటర్ ఇంటెలిజెన్స్ ఏఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్న ఆయన జిల్లాకు మూడో ఎస్పీగా బదిలీపై వస్తున్నారు. తొలుత గ్రూప్–1 అధికారిగా డీఎస్పీ హోదాలో అమలాపురంలోనే పోలీసు శాఖలో ప్రస్థానం ప్రారంభించిన శ్రీధర్ కన్‌ఫర్డ్ ఐపీఎస్ అధికారి అయి, ఏఎస్పీ, ఎస్పీ స్థాయికి ఎదిగారు. తిరిగి ఇక్కడే ఎస్పీగా తొలి పోస్టింగ్ పొందడం గమనార్హం. మూడు రోజుల్లో ఆయన జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిసింది. జిల్లాల పునర్విభజన అనంతరం కోనసీమ జిల్లాకు తొలి ఎస్పీగా సుబ్బారెడ్డి నియమితులయ్యారు. జిల్లా ఆవిర్భవించిన 50 రోజులకే అమలాపురంలో అల్లర్లు జరిగాయి. అనంతరం కొద్ది రోజుల తర్వాత సుబ్బారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సుధీర్‌కుమార్‌రెడ్డి రెండో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.

ట్రెండ్ సెట్టర్‌గా సుధీర్‌కుమార్‌రెడ్డి

ఇప్పటి వరకూ జిల్లా ఎస్పీగా పని చేసిన సుధీర్‌కుమార్‌రెడ్డి విధి నిర్వహణలో ప్రత్యేక ముద్ర వేశారు. అమలాపురం అల్లర్ల తర్వాత ఇక్కడి ప్రతికూల పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వమే ఆయనను ఎస్పీగా నియమించింది. అల్లర్లను పూర్తిగా అదుపు చేయడమే కాకుండా.. యువత గంజాయి వైపు వెళ్లకుండా ఆయన పటిష్ట చర్యలు తీసుకున్నారు. టీనేజ్ కుర్రాళ్లు లైసెన్సులు లేకుండా మోటార్ సైకిళ్లు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి నేరాలపై సుధీర్‌కుమార్‌రెడ్డి ఉక్కుపాదం మోపారు. పోలీసింగ్ అంటే ఇలా ఉండాలనే విధంగా జిల్లా పోలీసు శాఖలో ట్రెండ్ సెట్ చేశారని ఆయన పర్యవేక్షణలో పని చేస్తున్న సీఐలు, ఎస్సైలు చెబుతున్నారు. పోలీసులు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వర్తించే స్వేచ్ఛ తీసుకు వచ్చారు. సంక్రాంతి పండగల వేళ కోడిపందేల నిర్వహణలో ఒత్తిళ్లను ఖాతరు చేయకుండా పోలీసులదే పైచేయి ఉండేలా చర్యలు తీసుకున్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించే సంప్రదాయానికి అడ్డుకట్ట వేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



వెంకన్న ఆలయంలో భక్తుల కోలాహలం

- కిక్కిరిసిన వాడపల్లి వెంకన్న ఆలయం
- రూ.23.01 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ వేలాదిగా భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు నడిచి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ అవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనాలు, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.23,01,469 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

లక్ష్మీ నృసింహస్వామికి ఘనంగా జన్మ నక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: జన్మనక్షత్రం స్వాతిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారికి శనివారం అష్టోత్తర శతకలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నుంచి తెచ్చిన పవిత్ర జలాలను అర్చకులు వేదమంత్ర పఠనాలతో 108 కలశల్లోకి ఉంచారు. ఆ జలాల్లోకి స్వామివారిని మూలమంత్రంతో ఆవాహన చేసి, అర్చించారు. అలాగే సర్వదేవతలనూ కలశల్లోకి ఆవాహన చేసి విశేష పూజలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. స్వామివారి జన్మనక్షత్రం కలసి రావడంతో నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రెండో రోజైన శనివారం 60 మంది భక్తులు స్వామివారి 27 రోజుల దీక్ష స్వీకరించారు.



అంతర్వేదిలో రెండో రోజున స్వామి దీక్ష మాలాధారణ చేసిన భక్తులు

స్వామి సన్నిధిలో ప్రముఖులు

లక్ష్మీనృసింహ స్వామి వారిని జిల్లా దేవదాయ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించారు. అలాగే జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి కూడా స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. వారికి స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు సుదర్శనం రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి అందజేశారు.

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు 24 వరకూ దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరిలో ఉన్న ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలని ప్రధానోపాధ్యాయిని ఎస్.వెంకటలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 20న జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులు చదివి ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థినులు దీనికి అర్హులన్నారు. 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీలు; 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఉంటుందన్నారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98665 59624 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వెంకటలక్ష్మి తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు




సంఘటన స్థలంలో చెట్టును ఢీకొట్టిన కారు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి, చెట్టును ఢీకొంది. పోలీసులు, హైవే మెయింటెనెన్స్ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న బెన్ని, కౌశిక్, ప్రవీణ్, భరత్, సూర్య కలిసి శనివారం కారులో విశాఖ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్నేహితుడిని సూరంపాలెంలో దించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారి కారు గండేపల్లి శివారులో లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయి, అక్కడున్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులూ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి హైవే మెయింటెనెన్స్, రోడ్డు సెఫ్టీ సిబ్బంది చేరుకుని, కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. 108, హైవే అంబులెన్సుల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

పాడి-పంట



- హైబ్రిడ్ విత్తనాలు మేలంటున్న శాస్త్రవేత్తలు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రత్యేక దృష్టి
- ఎకరాకు 35 క్వింటాళ్ల వరకూ దిగుబడి

సామర్లకోట: మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందే అవకాశాలున్నాయని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న మనిషికి ఆహారంగానే కాకుండా పశువులకు దాణాగా కూడా ఉపయోగపడుతుంది. మొక్కజొన్నతో అనేక రకాల పిండి వంటలు కూడా తయారు చేస్తారు. ఇటీవల మొక్కజొన్న సాగుపై రైతుల్లో అవగాహన పెరగడంతో వారిని ప్రోత్సహించడానికి వ్యవసాయ అధికారులు కూడా ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా సంకరజాతి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నామని పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పి.మునిరత్న, ఐ.సుధీర్‌కుమార్ చెబుతున్నారు.

సాగుకు అనుకూలంగా హైబ్రీడ్ వంగడాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. అధిక ఉత్పాదకత కలిగిన అనుకూల వాతావరణం ఉండటంతో ఇక్కడ సాగుకు దీర్ఘ, మధ్యకాలిక విభాగాల్లో అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ వంగడాలు అనుకూలంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న నుంచి వివిధ ఉప ఉత్పత్తులు తయారు చేసి, ఎగుమతి చేయడం ద్వారా లాభాలు ఆర్జించే అవకాశం కూడా ఉంది. ఈ పంటపై ఆధారపడి దాదాపు 500 రకాల పరిశ్రమలు ఉన్నాయని చెబుతున్నారు. మొక్కజొన్నలోని ప్రతి పదార్థమూ వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి మూలపదార్థంగా ఉపయోగపడతాయి. పశువుల మేతగా, పూత దశలో కూరగాయగా, పాలు పోసుకునే దశలో కాల్చి తినే కండెగా, గింజ ముదిరిన తరువాత అనేక రకాల పరిశ్రమల్లో ముడిసరకుగా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. మొక్కజొన్న నూనెను అనేక దేశాల్లో వంటలకు వాడతారు. హృదయ సంబంధిత రోగులకు ఇది మంచిదని అంటారు. ఈ నూనెలో లినోలిక్, ఒలియిక్ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పిండితో కార్న్‌ఫ్లాక్స్, సూప్‌మిక్స్, ఇన్‌స్టెంట్ కార్న్, పఫ్స్, ఉప్మా మిక్స్, కేసరి బాదం, పేలాల వంటి కారపు, తీపి పిండి వంటలు చేసుకోవచ్చు. ప్రత్యేక రకాలైన తీపి మొక్కజొన్న, బేబీ కార్న్ వంటి రకాలు కూడా ఉన్నాయి.

పొలం ఎంపిక ఇలా..

మురుగు నీరు నిలవని, కలుపు, తెగుళ్లు లేని సారవంతమైన నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలం. గత సీజన్‌లో మొక్కజొన్న పండించి ఉండకూడదు. ఒకవేళ మొక్కజొన్న వేసి ఉంటే జన్యు స్వచ్ఛత కోసం నీటి తడి ఇచ్చి, నేలలో గత సీజన్ విత్తనాలను మొలకెత్తనిచ్చి బెరుకులు లేకుండా దున్ని, నశింపజేయాలి. నీటి వసతి ఉండాలి. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకూ రబీ విత్తు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి 10 కిలోల ఆడ, మగ విత్తనాల మోతాదు వాటి వరుసల నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. దాదాపు సాధారణ మొక్కజొన్న పంటలో మాదిరిగానే నీటి యాజమాన్యం సరిపోతుంది. పంట అన్ని దశల్లోనూ నీటి ఎద్దడి లేకుండా చూడాలి. మొదటి తడిలో ఆడ, మగ సాళ్లలోని విత్తనాలు కలిసిపోకుండా చూడాలి. గింజ తయారయ్యే దశలో ఎకరాకు 20 కిలోల నత్రజని అదనంగా వేయాలి.

మొక్కజొన్నపై పరిశోధనలు

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మొక్కజొన్న పంటపై వివిధ పరిశోధనలు సాగిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలైన సాంకేతికతతో పాటు సాగులో సమస్యలకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. రబీలో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్లు, ఖరీఫ్‌లో 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత, వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దాపురం



పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

సీఎం సభకు స్థలం పరిశీలన



బహిరంగ సభకు గోష్పాద క్షేత్రంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

కొవ్వూరు: 'వలంటీర్లకు వందనం' పేరుతో గ్రామ/వార్డు వలంటీర్లకు పురస్కారాలు అందించే రాష్ట్రస్థాయి కార్యక్రమం కొవ్వూరులో ఈ నెల 14వ తేదీన జరగనుంది. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు అనువైన స్థలాలను శనివారం ఆమె పరిశీలించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామ/వార్డు వలంటీర్ల సేవలకు గుర్తింపుగా నగదు పురస్కారాలను సీఎం చేతుల మీదుగా అందించనున్నారని కలెక్టర్ తెలిపారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను పరిశీలించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే హోం మంత్రి తానేటి వనితతో కలిసి ఐదారు స్థలాలను సందర్శించారు. పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఉన్న స్థలాలను, సంస్కృత పాఠశాల ప్రాంగణం, గోష్పాద క్షేత్రం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే స్థలం ఇంకా కొలిక్కి రాలేదని కలెక్టర్ చెప్పారు. అన్నింటికీ అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ఆర్అండ్‌బీ ఈఈ ఐ.దేవేంద్రరాజు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై వివాహాల రిజిస్ట్రేషన్ల నిలుపుదల

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివాహాల రిజిస్ట్రేషన్లను నిలుపు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో వివాహాలు చేసుకున్నవారి అభ్యర్థన మేరకు అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతూండటంతో ఆ రిజిస్ట్రేషన్లను నిలుపు చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ వ్రత సమయం మార్పు

సత్యదేవుని సన్నిధికి వచ్చి, స్వామివారి వ్రతం చేయించుకునే వెసులుబాటు లేనివారు ఆన్‌లైన్‌లో రూ.1,116 చెల్లిస్తే వారి గోత్రనామాలతో వ్రతం ఆచరించే వీలు కల్పించిన విషయం విదితమే. ఇప్పటి వరకూ ఉదయం 9 గంటలకు ఈ వ్రతం నిర్వహించి, దానిని దేవస్థానం యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసేవారు. దీని వలన ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశం ఉండేది కాదు. దీంతో ఆన్‌లైన్ వ్రతాన్ని గంట ముందుకు మార్చారు. ఆదివారం నుంచి ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ వ్రతం అనంతరం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుని నిత్యకల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: పట్టణంలోని పుంతలో ముసలమ్మ గుడిలో కూచి వెంకట మోహన్ నాగసాయి దుర్గా వీరభద్ర కల్కి (18) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నతనం నుంచీ అతడు మేనమామ నేతి నారాయణశర్మ సంరక్షణలో పెరుగుతున్నాడు. ఈ నెల 6న నారాయణశర్మ పౌరోహిత్యం పని మీద చింతలపూడి మండలం ప్రగడవరం వెళ్లారు. ఆయన భార్య శ్రీలక్ష్మి సత్యవతి చెన్నై వెళ్లారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న కల్కి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పట్టణంలో ఉంటున్న అతడి పెద్దమ్మ, నారాయణ శర్మ సోదరి శనివారం గుర్తించి ఆయనకు సమాచారం అందించారు. తన మరో సోదరి కుమారుడైన కల్కి చిన్నతనం నుంచీ తన వద్దే ఉంటున్నాడని, అన్నవరం వేద పాఠశాలలో వేదవిద్య నేర్పించానని నారాయణశర్మ చెప్పారు. కల్కి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

భార్యాపిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

కడియం: తన భార్య, ముగ్గురు పిల్లలు కనిపించడం లేదంటూ కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన ఐ.శ్రీనుబాబు పోలీసులను ఆశ్రయించాడు. గత ఏడాది నవంబర్ 30న తన భార్య ధన సాయిలక్ష్మి, తొమ్మిదేళ్ల కుమార్తె విజయకనకదుర్గ, ఏడేళ్ల హర్షవర్ధన్, ఐదేళ్ల వేదశ్రీ అదృశ్యమయ్యారని శ్రీనుబాబు ఫిర్యాదు చేశాడు. తాను పనికి వెళ్లిన తరువాత స్కూలు నుంచి పిల్లలను తీసుకుని వెళ్లినట్టు తెలిసిందన్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ భార్యాపిల్లల ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

తుని: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపాన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై మురళీమోహన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారానికి ఎడమవైపు ఉన్న కాలువ వద్ద రెండు గోడల మధ్య ఇనుప గొట్టానికి అతడు ఉరి వేసుకున్నాడు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అస్సాం రాష్ట్రం గోలపర గ్రామానికి చెందిన బర్మాన్ సంజయ్‌గా గుర్తించారు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ నగర్‌లో చోరీ

- రూ.5 లక్షల సొత్తు అపహరణ
- వరుస చోరీలతో అమలాపురం వాసుల ఆందోళన

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున జరిగిన చోరీలో రూ.5 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైంది. విద్యుత్ శాఖలో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా పని చేస్తున్న కుడుపూడి బాలకృష్ణ ఇంట్లో దొంగలు 18 కాసుల బంగారు నగలు దోచుకున్నారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న బాలకృష్ణ శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, స్వగ్రామం అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మికి భార్యాపిల్లలతో వెళ్లారు. ఆయన ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పై అంతస్తులో ఉంటున్న యజమాని సత్తి రామచంద్రమూర్తి శనివారం ఉదయం గమనించారు. ఆయన ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారంతో బాలకృష్ణ వెంటనే పాలగుమ్మి నుంచి విద్యుత్ నగర్ చేరుకున్నారు. ఇంట్లో చోరీ జరిగిందని, బీరువాలోని 18 కాసుల బంగారు నగలను దొంగలు దోచుకున్నారని గుర్తించారు. దొంగలు వీధి తలుపుల తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్ రూమ్‌తో పాటు ఇతర గదుల్లో ఉన్న బీరువాలను తెరచి సామాన్లను చిందరవందర చేశారు. క్లూస్ టీమ్ వచ్చి దొంగల వేలిముద్రలను సేకరించింది.



చోరీ జరిగిన ఇంట్లో స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్న పోలీసులు

సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి సందర్శించారు. చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆ కెమెరాలు రోడ్డు వైపు ఉండటంతో కేసు దర్యాప్తులో భాగంగా పుటేజీలు సేకరించారు. పట్టణ ఎస్సై కేవీవీ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఎం.సుబ్బరాజు, సిబ్బంది బాలకృష్ణ కుటుంబీకుల స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఇద్దరు ముసుగు దొంగలు గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి చొరబడి యజమానిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మర్నాడే విద్యుత్ నగర్‌లో చోరీ జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.